క్లుప్తంగా

ఎమ్మెల్యేకు పీఏసీఎస్ చైర్మన్ కృతజ్ఞతలు



ఎమ్మెల్యే రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న సురేష్ తదితరులు

హిరమండలం: హిరమండలం పీఏసీఎస్ పాలకవర్గం పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. దీంతో అధ్యక్షుడు ఏవీ సురేష్.. ఎమ్మెల్యే రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలియజేశారు. నాలుగు పర్యాయాలు పాలకవర్గంలో తమను కొనసాగించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో పాలకవర్గ సభ్యులతో శుక్రవారం కలిసి ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. డైరెక్టర్లు శంకర్‌రావు, భాస్కరరావు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మీసాల వెంకటరామకృష్ణ ఉన్నారు.

ఆస్పత్రి ప్రసవాలు పెరగాలి



రికార్డులు పరిశీలిస్తున్న లక్ష్మీతులసీ

సారవకోట: ఆస్పత్రి ప్రసవాలు పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో లక్ష్మీతులసీ సిబ్బందికి సూచించారు. సారవకోట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆస్పత్రిలో ప్రసవాలు పూర్తిస్థాయిలో జరగడం లేదన్నారు. ప్రసవాల సంఖ్య పెంచాలని.. లేక పోతే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రోజు వారి ఓపీ, సిబ్బంది హాజరును పరిశీలించారు. వైద్యులు సౌమ్య, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ సురేష్‌కుమార్ ఉన్నారు.

వైద్యురాలు మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న వైద్య సిబ్బంది

ఎల్.ఎన్.పేట: సోంపేట మండలం బట్టిగల్లూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు భవ్య రోడ్డు ప్రమాదంలో గురువారం మృతి చెందారు. ఆమె మృతికి ఎల్.ఎన్.పేట మండలం లక్ష్మీనర్సుపేట, తురకపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది శుక్రవారం సంతాపాన్ని తెలియజేశారు. భవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైద్యులు ఎస్.సునీత, ప్రియాంక, సీతూ, లక్ష్మీదీప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపైపులైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు



మాట్లాడుతున్న సర్పంచ్ బూరల్లి శంకర్

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధిలోని అన్ని వీధులకు మంచినీటిని సక్రమంగా అందించడానికి ఇప్పుడున్న పైపులైన్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడానికి పంచాయతీ తీర్మానం చేశామని సర్పంచ్ బూరల్లి శంకర్ వెల్లడించారు. మేజరు పంచాయతీ పాలకవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా పలు అంశాలపై తీర్మానాలు చేశామన్నారు. ప్రధానంగా పైడితల్లి అమ్మవారి గుడి నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకూ కొత్త పైప్ లైన్ వేయడానికి, దేవాదివీధిలో నాలుగు బోర్లు ఏర్పాటుకు, ప్రధాన రహదారిపై ఎల్ఈడీ దీపాలు, మార్కెట్ రోడ్డు లెవెల్ చేయడానికి సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారన్నారు. ఎమ్మెల్యే నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, వార్డు సభ్యులు గుప్త, బీఎల్ శర్మ, ఆర్.శ్రీధర్, పి.కృష్ణప్రసాద్, పంచాయతీ ఈవో సింహాద్రినాయుడు పాల్గొన్నారు.

పశువులకు లంపీస్కిన్ నివారణ టీకాలు



టీకాలు వేసే ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీ ఆనందరావు

ఆమదాలవలస: పశువులకు లంపీస్కిన్ వ్యాధి సోకకుండా ప్రభుత్వం ఉచితంగా టీకాలను వేస్తోందని ఆమదాలవలస పశుసంవర్ధక శాఖ ఏడీ ఆర్.ఆనందరావు చెప్పారు. పాడి రైతులు తమ పశువులకు విధిగా వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని సూచించారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి 18వవార్డు బొడ్డేపల్లిపేటలో శుక్రవారం ఏర్పాటు చేసిన లంపీస్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పాలిటెక్నిక్ విద్యార్థులు, పాడిరైతులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు



నారాయణపురంలో కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- పలు గ్రామాల్లో కుళాయిల ఏర్పాటు పనులకు శంకుస్థాపన

బూర్జ: ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేయడమే తమ ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. గుత్తావల్లి గ్రామంలో రూ. 1.14 కోట్లు, లాభాంలో రూ. 69 లక్షలు, నారాయణపురంలో రూ. 38 లక్షలతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఏర్పాటు చేయనున్న ఇంటింటికీ కుళాయిల పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో మహిళలు పడుతున్న కష్టాలు చూసి గ్రామాల్లో నీటి కొరత లేకుండా చూడాలనే లక్ష్యంతోనే నిధులు కేటాయించి పనులు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. తొలుత గుత్తావల్లి గ్రామంలో సమగ్ర భూసర్వే పట్టాలను లబ్ధిదారులకు స్పీకర్ పంపిణీ చేశారు. లాభాం గ్రామంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషకాహారం కిట్లు అందజేశారు. నవంబర్ నెలాఖరు నాటికి ఇంటింటికీ కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషిచేస్తున్న సీఎం జగన్‌ను రానున్న ఎన్నికల్లో గెలిపించుకుంటే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, పీఏసీఎస్ చైర్మన్ బగాది నారాయణమూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకట్రావు, మండల కన్వీనర్ల కోఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు బొడ్డేపల్లి రమణమ్మ, పార్టీ నాయకులు మామిడి శ్రీనువాసరావు, కరణం అనిల్, బొడ్డేపల్లి నాగరాజు, తొత్తడి సురేష్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

7న రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రారంభం

- హాజరుకానున్న పలువురు మంత్రులు



స్థల పరిశీలన చేస్తున్న చిరంజీవినాగ్

ఆమదాలవలస: ఆమదాలవలసకు జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల మంజూరైందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి తరగతులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. కళాశాలను తాత్కాలిక భవనంలో ఈ నెల ఏడో తేదీన ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. కళాశాల ప్రారంభోత్సవానికి బీసీ వెల్ఫేర్‌శాఖ మంత్రి చెల్లబోయిన వేణుగోపాలరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, ఇతర ముఖ్యులు హాజరవుతారన్నారు. ఈ మేరకు సభ ఏర్పాటుకు స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. స్థానిక కృషివిజ్ఞానకేంద్రం ఆవరణలో సమావేశం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గాన్ని విద్యాసంస్థల హబ్‌గా తయారు చేయడమే స్పీకర్ తమ్మినేని సీతారాం ధ్యేయమని చెప్పారు. మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పొందూరు మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ పాల్గొన్నారు

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సత్కారం



నరసన్నపేట: ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

నరసన్నపేట: యారబాడు ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వేరే పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, భూషణరావులను గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎంఈవోలు దాలినాయుడు, శాంతారావులు మాట్లాడుతూ.. బాధ్యతగా పని చేసిన ఉపాధ్యాయులకు గ్రామస్తుల నుంచి ఇటువంటి సత్కారాలు లభిస్తాయన్నారు. ఉపాధ్యాయ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యాబాజీ రమేష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరు: సామరాజపురం ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం ఆదినారాయణ, ఉపాధ్యాయులు ఎస్.గణేష్, రవి, బి.పురుషోత్తం, డి.సౌజన్యావతిలను గ్రామస్తులు సత్కరించారు. వారి సేవలను కొనియాడారు.

పోలాకి: పోలాకి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన ఎస్.అన్నపూర్ణారావు సేవలు అభినందనీయమని కళాశాల విద్యాకమిటీ చైర్మన్ బరాటం కృష్ణారావు అన్నారు. స్కూల్ కమిటీ సభ్యులు, సిబ్బంది, పూర్వ విద్యార్థుల సమక్షంలో అన్నపూర్ణారావును సత్కరించి అభినందించారు. ప్రిన్సిపాల్ గోవిందరావు, సీనియర్ అధ్యాపకులు బి.ఎల్.వి.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల సర్వే

జలుమూరు: బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సర్వేను పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ బి.సత్యం అన్నారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌వోలతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రధానంగా వలస, బోగస్ ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల డీటీ శరత్, సర్వే డీటీ తిరుపతిరావు ఉన్నారు.

హిరమండలం: ఓటరు సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ బి.మురళీమోహన్ అన్నారు. కొండరాగోలు, దుర్బలాపురం గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటా ఓటరు సర్వేను పరిశీలించారు. సకాలంలో సర్వేను పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

వరుస క్రమంలో నాట్లు వేయాలి

కొత్తూరు: వరినాట్లను లైన్ షోయింగ్ (వరుస క్రమం) పద్ధతిలో వేయడం ద్వారా అధిక దిగుబడులు సాధ్యమని ప్రకృతి వ్యవసాయం ఎంటీ సూర్యనారాయణ, కర్లెమ్మ గ్రామ వ్యవసాయ సహాయకురాలు లక్ష్మీకల్యాణిలు అన్నారు. మహసింగిగూడలో వరుస క్రమంలో నాట్లను రైతులతో శుక్రవారం వేయించారు. ఈ విధానం ద్వారా సుడిదోమ ఆశించదని, దుబ్బులకు గాలి, వెలుతురు బాగా తగలడం ద్వారా దిగుబడి బాగుంటుందని అవగాహన కల్పించారు.

డ్రాపౌట్ లేకుండా చూసుకోవాలి

పాతపట్నం: డ్రాపౌట్స్ లేకుండా ప్రతి విద్యార్థి పాఠశాలకు వెళ్లేలా చూడాలని జిల్లా ఏఎల్ఎస్ సమగ్ర శిక్షా కోఆర్డినేటర్ పి.జనార్దనరావు అన్నారు. ప్రహరాజపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకులంలో ఇద్దరు డ్రాపౌట్ విద్యార్థినులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.అర్చన, బాబూరావు, ఉపాధ్యాయులు, సీఆర్‌టీలు ఉన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ మేలు

- నీతి, నిజాయితీ లేని వ్యక్తి కలమట
- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులందరికీ మేలుజరిగిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ప్రజలకు సువర్ణ పాలన అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలనను తీసుకొచ్చారన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. పథకాలు అందకుండా అర్హులెవరూ మిగిలిపోరాదన్న ఆశయంతో ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైందని, ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని చెప్పారు. ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు నినాదంతో ముఖ్యమంత్రి సురక్ష కార్యక్రమాన్ని అమలు చేశారన్నారు. జూన్ ఒకటి నుంచి 30వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. పాతపట్నం నియోజకవర్గ పరిధిలో 71,759 కుటుంబాలకు సర్వే నిర్వహించినట్టు పేర్కొన్నారు. 91 జగనన్న సురక్ష సభల్లో 43,193 దరఖాస్తులు చేసుకోగా 42,706 ధ్రువపత్రాలు పంపిణీ చేసినట్టు వివరించారు.

గౌరవం తెలియని 'కలమట'

మహిళలను అసభ్య పదజాలంతో దూషిస్తే నాయకుడు అయిపోగలరా అని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణను ఉద్దేశించి ఎమ్మెల్యే అన్నారు. మహిళా ప్రజాప్రతినిధికే గౌరవం ఇవ్వని కలమట వెంకటరమణ నియోజకవర్గ మహిళలకు ఇంకేం గౌరవం ఇస్తారని ప్రశ్నించారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ తీసుకొని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిష్మా, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే.. తన స్వార్థం కోసం టీడీపీలో చేరిపోయిన వ్యక్తి కలమట అన్ని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనతి కాలంలోనే ఆర్థికంగా బలపడడం కోసం, పాతపట్నం నియోజకవర్గ ప్రజలకు అందవల్సిన వనరులు అందించకుండా, సంక్షేమాన్ని పట్టించుకోకుండా, అభివృద్ధికి కృషి చేయకుండా, కేవలం తన అభివృద్ధి, ఇసుక వ్యాపారం, వంశధార నిర్వాసితుల ప్యాకేజీల కోసం, ప్రతి ఒక్క వ్యాపార సంస్థలో కమీషన్ల కోసం టీడీపీ నాయకుల నుంచి కోట్ల రూపాయలు తీసుకుని వారికి అమ్ముడైపోయి.. నిన్ను నమ్మి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు, కన్నతల్లి లాంటి పార్టీకి, రాజకీయ భిక్ష పెట్టిన జగన్‌మోహన్‌రెడ్డిని సైతం వెన్ను పోటు పొడిచి పార్టీ ఫిరాయించిన ఘనుడు కలమట అని వ్యాఖ్యానించారు. నీరు–చెట్టు పథకం ద్వారా అవినీతి అక్రమాల్లో శ్రీకాకుళం జిల్లాలోనే పెద్ద దళారీగా పేరు సంపాదించుకున్న ఘనుడు అని ఆరోపించారు. అందుకే 2019 ఎన్నికల్లో ప్రజల్ని మోసం చేసిన దుర్మార్గుడిని పాతపట్నం ప్రజలు ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెప్పారన్నారు. సమావేశంలో కొత్తూరు జెడ్పీటీసీ సభ్యురాలు కె.భాగ్యలక్ష్మి, పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, ఎల్.ఎన్.పేట పీఏసీఎస్ అధ్యక్షులు ఎం.శ్యామ్‌సుందరరావు, బాలరాజు, ఎ.వి.సురేష్, కృష్ణ, రెడ్డి రామారావు, ఏఎంసీ చైర్మన్ అర్జునుడు, సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, పార్టీ నాయకులు ఉదయ్‌కుమార్, జి.అప్పన్న, యోగి, బాలరాజు, రామకృష్ణ, మోహన్ పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఏఈగా రమణమూర్తి



బాధ్యతలు తీసుకుంటున్న రమణమూర్తి

మెళియాపుట్టి: మండల విద్యుత్ శాఖ ఏఈగా టి.వి. రమణమూర్తి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ విధులు నిర్వహించిన అప్పలనాయుడు విశాఖకు బదిలీపై వెళ్లారు.

నిర్వాసితులతో సమావేశం

కొత్తూరు: వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ కోరారు. కర్లెమ్మ ఆర్‌ఆర్ కాలనీలో నిర్వాసితులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అదనపు పరిహారం కొంతమందికి చెల్లించలేదని.. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

కొత్తూరు: విజయవాడలో న్యాయవాది వితలబాబు హత్యను నిరసిస్తూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జికోర్టు న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించారు. తమ కోసం రక్షణ చట్టాన్ని ప్రభుత్వం తీసుకురావాలని న్యాయవాదులు నినాదాలు చేశారు.

దీక్షలను విజయవంతం చేయాలి

సరుబుజ్జిలి: జిల్లా కేంద్రంలో ఈనెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్న వీఆర్‌ఏల దీక్షలను విజయవంతం చేయాలని వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.సూర్యనారాయణ కోరారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన వీఆర్‌ఏలను శుక్రవారం కలుసుకున్నారు. డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టనున్న దీక్షలో అందరూ పాల్గొనాలన్నారు.

సైరిగాంలో ఫీవర్ సర్వే

జలుమూరు: సైరిగాం గ్రామంలో ఫీవర్ సర్వే కొనసాగుతోంది. శుక్రవారం వైద్యసిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి జ్వర పీడితులకు మందులు అందించారు. ప్రత్యేక బృందాలతో ఫీవర్ సర్వే నిర్వహించి రక్తపూత నమూనాలను సేకరించారు. మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు చేసి మందులు అందిస్తున్నామని సైరిగాం మెడికల్ అధికారి పి.గురునాథరావు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

హిరమండలం: తమ సమస్యలను పరిష్కరించాలని రేషన్ సరుకులు పంపిణీ ఎండీయూ ఆపరేటర్లు కోరారు. ఈమేరకు తహసీల్దార్ బెహర మురళీమోహన్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. సరుకుల పంపిణీలో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజల వద్దకే పాలన



హనుమాన్‌నగర్‌లో లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా పాలనను ప్రజల వద్దకే తీసుకొచ్చిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని స్థానిక ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేట మేజరు పంచాయతీ పరిధిలోని హనుమాన్‌నగర్, పచారీ కాలనీ, జయలక్ష్మీనగర్, శ్రీరామనగర్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణదాస్‌తో పాటు వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్లను అందజేశారు. మంచినీటి సమస్య పరిష్కరించాలని, పొజిషన్ సర్టిఫికెట్లు కావాలని హనుమాన్‌నగర్‌కు చెందిన పలువురు మహిళలు కృష్ణదాస్‌ను కోరగా.. త్వరలోనే సమస్య పరిష్కరిస్తానని హామీ నిచ్చారు. పచారీ కాలనీలో శిథిలమైన ఇళ్ల స్థానంలో పక్కా ఇళ్లు మంజూరు చేయాలని, సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలని పలువురు కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఇంటి గడపకు వచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గతంలో ఈవిధంగా సంక్షేమ పథకాలు అందిచలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చారన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి అండగా నిలవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.మధుసూదనరావు, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, సుడా చైర్మన్ కోరాడ ఆశాలత, పార్టీ నాయకులు గుప్త, సురంగి నర్సింగరావు, పి.సాయిప్రసాద్, శిల్పి కృష్ణ, తంగుడు జోగారావు, రమణ సాహూ, బోయిన బాలకృష్ణ, ఆర్.శ్రీధర్, కేశవరాజు, రాంజీ, దండి జయప్రకాశ్, పెదిరెడ్ల పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం చేరువ



ప్రజలకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: అర్హులందరికీ సంక్షేమ పథకాలను చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి దక్కిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం మండల కేంద్రంలోని సచివాలయం-3 పరిధి సాత్యసాయి మందిరం వీధి , శివశంకర్ వీధి ఒకటో లైనులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఇప్పటి వరకు చేకూరిన ప్రయోజనాలను వివరించి బ్రోచర్లను అందజేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. ప్రజల కోసం పరితపిస్తున్న సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. అడ్డదారుల్లో అధికారం పొందేందుకు, ప్రజలకు మాయమాటలు చెప్పేందుకు వస్తున్న టీడీపీ నాయకులను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కరుణాకరావు, ఎంపీడీవో జయంత్ ప్రసాద్, ఈవో పీఆర్డీ ప్రసాద్ పండా, ఈవో కూర్మారావు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు అర్జునరావు, తాతయ్య, సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, వైస్ ఎంపీపీ ప్రదీప్, పనుకు మోహన్, కర్రి లక్ష్మీనారాయణ, జి.అప్పన్న, రాము, రాజు, వరదరాజులు, శ్రీనివాసరావు, రామారావు, ఉప సర్పంచ్ మమత, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజనాలే ధ్యేయం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- కింతలిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: ప్రజా ప్రయోజనాలే ప్రభుత్వ ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. అర్హులందరికీ పక్కాగా సంక్షేమ పథకాలు అందించేందుకే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. కింతలి గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమాన్ని తెలియజేశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించి బ్రోచర్లను అందజేశారు. బడుగు, బలహీన వర్గాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువ చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పథకాల కోసం ఎవరికి ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో ప్రతి కుటుంబాన్ని కలిసే అవకాశం ప్రభుత్వం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కాలువలు, రోడ్లు కావాలని స్థానికులు స్పీకర్‌ని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, నాయకులు కిల్లి నాగేశ్వరరావు, సింగూరు సూర్యనారాయణ, సింగూరు తేజేశ్వరరావు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

బూర్జ: కొల్లివలసలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి వి.రాజేశ్వరరావు శుక్రవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, ఇన్వాయిస్ ప్రకారం గోదాంలోని స్టాక్ పరిశీలించారు. దుకాణ యజమానులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. తనిఖీల్లో భాగంగా ఎరువులు శాంపిళ్లను సేకరించి రాష్ట్రంలోని రీజనల్ కోడింగ్ సెంటర్‌కు పంపిస్తున్నట్టు రాజేశ్వరరావు తెలిపారు. ఏఈఓ టి.రాము ఉన్నారు.

జోరుగా పోషణ కిట్ల పంపిణీ



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో కిట్లను అందజేస్తున్న ఉపసర్పంచ్ పైడి నరిసింహ అప్పారావు

జగనన్న పోషణ కిట్ల పంపిణీ ప్రక్రియ జోరుగా సాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం పలు గ్రామాల్లో కిట్లను పంపిణీ చేశారు. టేక్ హోమ్ రేషన్ పంపిణీ ప్రాధాన్యతను వక్తలు వివరించారు. బాలింతలు, గర్భిణుల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించి వైఎస్సార్ జగనన్న పోషణ కిట్లను పంపిణీ చేస్తున్నారన్నారు.



ఆమదాలవలస రూరల్: కట్యాచార్యులపేటలో కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రామచంద్రరావు



జలుమూరు: చల్లవానిపేటలో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ వాన గోపి



సారవకోట: పెద్దలంబలో టీహెచ్‌ఆర్ కిట్లు అందజేస్తున్న సర్పంచ్ షణ్ముఖరావు



సారవకోట: తొగిరిలో కిట్లను అందిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు యోగేశ్వరి